'హెచ్‌సీయూ'లో ప్రజాస్వామ్యం ఖూనీ

భూమి ధర పెంచి పేదలను తరిమివేయడమే అసలైన కుట్ర • గచ్చిబౌలిలో వర్షపు నీరు వెళ్లేందుకు సరైన కాల్వలు లేవు

గ్లోబల్ వార్మింగ్‌పై ప్రభుత్వం ఏం సమాధానం చెప్తుంది? • యూనివర్సిటీ విద్యార్థుల పోరులో ప్రజలు కలిసిరావాలి

హెచ్‌సీయూ అంశంపై 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో • అర్బన్ వాటర్ అండ్ క్లైమెట్ చేంజ్ నిపుణుడు బీవీ సుబ్బారావు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని అర్బన్ వాటర్ అండ్ క్లైమెట్ చేంజ్ నిపుణుడు బీవీ సుబ్బారావు ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రం మొత్తంలో ఉన్న భూవినియోగంలో 35 శాతం అడవులకు కేటాయించాలని ఆయన సూచించారు. ప్లానింగ్ దశలో ఐదు అంశాలను తప్పనిసరిగా జోడించాలని పేర్కొన్నారు. భూమి, నీరు, గాలి, శక్తి, ఓపెన్ స్పేస్‌లను ఐదు అంశాలుగా పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. హెచ్‌సీయూ భూమి ప్రజల ఆస్తి అని, విద్యార్థులు చేసే ఆందోళనలకు ప్రజలు కూడా బాసటగా నిలవాలని కోరారు. ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య వ్యవస్థకు ధర్మకర్తలు మాత్రమేనని, యజమానులు కాదని చెప్పారు. సోమవారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు.

నమస్తే తెలంగాణ: హెచ్‌సీయూ భూముల అంశంలో ప్రభుత్వ చర్యలను ఏ విధంగా చూడొచ్చు?

బీవీ సుబ్బారావు: భూవినియోగం, సహజ వనరుల్లో తెలంగాణ రాష్ట్రానికి మంచి చరిత్ర ఉంది. అయితే ప్రభుత్వం చదును చేసేందుకు సిద్ధపడిన 400 ఎకరాల భూమి ప్రభుత్వానిది కాదు.. హెచ్‌సీయూది కాదు.. అది ప్రజల ఆస్తి. ఆ ఆస్తిని కాపాడాటానికే మనం నాయకులను ఎన్నుకుంటున్నాం. అధికారంలోకి రాగానే ప్రజాపాలన అని దరఖాస్తులు తీసుకున్నారు. మరి ఈ అంశంపై ప్రజల్లో ఎందుకు చర్చ జరపలేదు. గచ్చిబౌలిలో నీళ్లు వెళ్లడానికి కాల్వలు లేవు. పరిపాలన దక్షత అంటే అన్ని అంశాలపై దృష్టి సారించడం. అయితే ప్రజాస్వామ్యంలో అన్ని ప్రజల ఆస్తులేనని ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలి. మేజర్ భూమి వినియోగ మార్పుపై ప్రజల్లో, అసెంబ్లీలో ప్రభుత్వం ఎందుకు చర్చ జరపలేదు. క్యాబినెట్‌లో కూడా చర్చించకుండా ఎలా ముందుకు వెళ్తారు. ఎకరానికి రూ.100 కోట్ల చొప్పున ఆ భూమిని అమ్మేందుకు ప్రభుత్వం సిద్ధమైతే అక్కడ స్కూళ్ల నిర్మాణానికి ఏమైనా ఆస్కారం ఉంటుందా? అంటే అక్కడి నుంచి పేద వాళ్లను తరిమేయడమే ఉద్దేశంలా కనిపిస్తున్నది. ప్రభుత్వాలు ప్రజలందరినీ అభివృద్ధిలో భాగస్వామ్యులు చేయాలి. అక్రమ కట్టడాలను కూల్చి వేస్తామని హైడ్రా చెప్పింది. మరి ప్రక్షాళన ఎక్కడ జరిగింది?

నమస్తే తెలంగాణ: అడవులు తగ్గిపోతే భావితరాల పరిస్థితి ఏంటి?

బీవీ సుబ్బారావు: ఆఫ్రికా లాంటి దేశాల్లో అడవులపై కేస్ స్టడీలు చేస్తారు. తమ అడవుల్లో జంతువులు ఉన్నాయని, అవే పర్యాటక రంగానికి ఆర్థిక వనరులా ఉపయోగపడతాయని అక్కడి వాళ్లు భావిస్తారు. ఎకో పార్క్‌లు అని నగరానికి దూరంగా నిర్మించారు. అవే నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసి ఉంటే, అడవులు, జంతువులు నగరంలోనే ఉంటే ఎంత బాగుండేది. చిన్నారులు, ప్రజలు జంతువులను చూడటానికి ఇష్టపడుతున్నారు. మన దగ్గర ప్రభుత్వానికి సలహాలు ఇచ్చే వాళ్లు సరిగా లేరు. ప్రభుత్వం ఇంత ఒత్తిడితో ముందుకెళ్తున్నది అంటే ఇప్పటికే భూముల అంశంలో ఒప్పందాలు జరిగి ఉండాలి.

బ్యాంకులు అప్పులు ఇచ్చేటప్పుడు రిస్క్ అసెస్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మరి బ్యాంకులు ఈ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతనే రూ.వందల కోట్లు అప్పులు ఇస్తున్నాయా? గతంలో నాయకులకు అభివృద్ధి చేయాలనే తపన ఉండేది. ఇప్పుడు నీకెంత? నాకెంత? అనేవిధంగా రాజకీయాలు తయారయ్యాయి. ఆర్గనైజేషనల్ ఓపెన్ స్పేస్‌లు, పార్క్‌లు నగరానికి చాలా అవసరం. ప్రభుత్వ చర్యలతో అడవులు తగ్గిపోతున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే గతంలో మన దగ్గర అడవులు ఉండేవని భావితరాలకు చెప్పాల్సిన పరిస్థితులు వస్తాయి. భూవినియోగ పద్ధతులపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరమున్నది.

నమస్తే తెలంగాణ: ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను తనఖా పెట్టి అప్పుగా డబ్బులు తెచ్చుకుంది అనే చర్చ జరుగుతున్నది కదా..?

బీవీ సుబ్బారావు: భూముల అమ్మకానికి నాడు చంద్రబాబునాయుడు విత్తనం వేశారని, అదే విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్నది. 400 ఎకరాల భూమిని ఓ ప్రైవేటు బ్యాంకులో తనఖా పెట్టినట్టు సమాచారం ఉంది. అయితే ఆ భూమిపై జీహెచ్ ఎంసీకే ప్రథమ హక్కు ఉంటుంది. జీహెచ్ ఎంసీ నుంచి ఒక్క ప్రకటన కూడా రాకపోవడం ఏంటీ? ప్రభుత్వం జీహెచ్‌ఎంసీని చెత్త బుట్టలో పడేసింది. నగరీకరణలో ఓపెన్ స్పేస్‌లు, నీటి వనరులు, ఆక్సిజన్, అడవులు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. గ్రామాల్లో, పట్టణాల్లో భూమి వినియోగంలో మార్పులపై చాలా నియమాలు ఉన్నాయి. గతంలో జూబ్లీహిల్స్ సొసైటీ అని ఉండేది. ఇంటి స్థలంలో 35 శాతం చెట్ల పెంపకానికి కేటాయించాలనే నిబంధన ఉండేది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో ట్రాఫిక్ రోడ్డుల మీద బారులుతీరి కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలన్నింటి ప్రభావం మన కండ్ల ముందే కనబడుతున్నది. వర్షాలు పడితే ఇప్పటికే గచ్చిబౌలి నీళ్లు వెళ్లేందుకు కాల్వలు లేవు. ప్రభుత్వంలో జరుగుతున్న అనవసర ఖర్చుల తగ్గింపుపై ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఉచితాలపై కచ్చితంగా సమగ్ర చర్చ జరగాలి.

నమస్తే తెలంగాణ: జీవ వైవిధ్యం ఉన్న హెచ్‌సీయూ లాంటి భూములపై ప్రజల్లో చైతన్యం కలగాలంటే ఏం చేయాలి?

బీవీ సుబ్బారావు: జీవవైవిధ్యం ఉన్న ఈ భూములపై ప్రజల్లో చైతన్యం రావాలంటే శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు విస్తృతంగా ప్రచారం చేయాలి. రూ.100ల కోట్లు రుణాలు ఇస్తున్న బ్యాంకులను న్యాయవ్యవస్థ కూడా ప్రశ్నించాలి. భూములను అమ్మే ఆలోచన మొదటి నుంచి బీజేపీదే. 2000 సంవత్సరం మొదటి నుంచి ఈ భూముల అమ్మకం ప్రారంభమైంది. ఆ ప్రక్రియను ప్రస్తుత ప్రభుత్వం బాహాటంగా కొనసాగిస్తున్నది. ఈ భూముల్లో స్కూళ్లు కడతారా? ఆస్పత్రులు కడతారా? కాల్వలు కడతారా? అనే విషయంపై ప్రజలకు ప్రభుత్వం జవాబు చెప్పాలి. ఇందిరాగాంధీ హయాంలో అటవీ ప్రాంతాలను సంరక్షించారు. తక్కువ మెజార్టీతో పీవీ నర్సింహరావు లోక్‌సభను నడిపించారు. 74, 72 రాజ్యాంగ సవరణ తీసుకువచ్చి లోకల్ గవర్నింగ్ బాడీస్‌లలో రిజర్వేషన్లు తీసుకువచ్చారు. అలాంటి నేతల నుంచి ప్రస్తుతం ఉన్న నేతలు ఏం నేర్చుకుంటున్నారు? లోక్‌సభ, అసెంబ్లీలో గెలిచిన నేతలకు గతంలో శిక్షణ ఇచ్చే కేంద్రం ఉండేది. దాన్ని సైతం ఎత్తేశారు.

నమస్తే తెలంగాణ: గ్లోబలైజేషన్, అభివృద్ధి కోసమే ఇదంతా అని ప్రభుత్వం చెప్తున్నది కదా?

బీవీ సుబ్బారావు: గ్లోబలైజేషన్ అని అమెరికా లాంటి దేశాల కంపెనీలకు ప్రభుత్వాలు రెడ్ కార్పెట్ వేస్తున్నాయి. వాళ్లు మాత్రం మనవాళ్ల కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి అవమానించేలా మన దేశానికి తిరిగి పంపేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా విధానాలు మారడంలేదు. అడవి భూములు అంతరించిపోవడంతో గ్లోబల్ వార్మింగ్, అకాల వర్షాలు పడుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్‌పై ప్రభుత్వం ఏమని సమాధానం చెప్తుంది. గతంలో కమ్యూనిస్టు పార్టీలు ఇలాంటి అంశాలను ప్రశ్నించేవి. ప్రస్తుతం వారు సైతం మాట్లాడటం లేదు. ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజల ముందు అన్ని అంశాలను ఉంచే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. భూవినియోగంపై ప్రభుత్వం మరింత శ్రద్ధ వహించాలి. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రణాళికాబద్ధంగా పనిచేసి దీర్ఘకాలిక లక్ష్యాల కోసం రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలి.

ఫ్రీ బస్ రహస్యమా?

మొదటిపేజీ తరువాయి...

ఉన్నదని ధ్వజమెత్తారు. ఆ లేఖలో సంస్థ ఇచ్చిన తప్పుడు సమాచారంపై పలు ప్రశ్నలు సంధిస్తూ.. వాటికి యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'మహాలక్ష్మి' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న సిబ్బంది గురించి, వాళ్లు పడుతున్న ఇబ్బందుల గురించి, రావలసిన ఆదాయం గురించి యాజమాన్యం తన ప్రకటనలో ఎందుకు ప్రస్తావించలేదో చెప్పాలని నిలదీశారు.

పీఎఫ్, సీసీఎస్ డబ్బులు తిన్నదెవరు?

కార్మికులు కూడబెట్టుకున్న పీఎఫ్, సీసీఎస్ సంస్థల నుంచి అక్రమంగా నిధులు కాజేసిన వ్యక్తి ఎవరని కార్మిక సంఘాల నేతలు ప్రశ్నించారు. ఆ అపవాదు తనపైకి రాకుండా తప్పును కప్పిపుచ్చుకోవడానికి తాపత్రయ పడుతున్న వ్యక్తి ఎవరో ఆర్టీసీ యాజమాన్య ప్రకటన స్పష్టం చేసిందన్నారు. 'పీఎఫ్ బకాయిలు విడతలవారీగా చెల్లిస్తూ రూ.580.37 కోట్లకు తగ్గించారా? లేక మూడేండ్ల నుంచి ప్రతినెలా చెల్లిస్తున్నారా? ఇదే నిజమైతే పీఎఫ్ అధికారులు చెపుతున్న రూ.1,200 కోట్ల బకాయిలు (వడ్డీతో కలిపి) ఎందుకు ఉన్నట్టు? సీసీఎస్ బకాయిలను కూడా రూ.451.9 కోట్లకు తగ్గించామని చెప్తున్నప్పటికీ సీసీఎస్ లెక్కల ప్రకారం ఇంకా రూ.1,050 కోట్లు (వడ్డీతో కలిపి) బకాయిలు ఎందుకు ఉన్నాయి? మీరు చెప్పిన లెక్కలు సంస్థ లెక్కలా? లేక మీరు వాడుకున్న లెక్కలా?' అంటూ యాజమాన్యాన్ని నిలదీశారు. పొదుపు సొమ్ముపై వడ్డీని దిగమింగి, అన్యాయం చేశారని ఆరోపించారు.

ఆస్పత్రుల్లో చేతుల మారిన నిధులు ఎన్ని?

తార్నాక హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చినప్పుడు రెఫరల్ హాస్పిటల్ ఖర్చు రూ.22 కోట్లను ఎందుకు కేటాయించాల్సి వచ్చింది? అందులో చేతులు మారిన నిధులు ఎన్ని? అని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సంస్థ యాజమాన్యాన్ని నిలదీశారు. 'హెల్త్ క్యాంపులు పెట్టామని గొప్పలు చెప్తున్న అధికారులు.. వారి వేధింపులు భరించలేక, విశ్రాంతి లేక పనిభారంతో ఎంత మంది కార్మికులు రోగాల బారినపడ్డారో తెలుసుకున్నారా? ఏటా ఎంతమంది చనిపోతున్నారో లెక్కలు తీశారా? వారి చావులకు యాజమాన్యం కారణం కాదా? అని ప్రశ్నించారు. తార్నాకలో, బస్ భవన్‌లో అవినీతి కాంట్రాక్టుల గురించి, పనిచెయ్యకుండానే రూ.లక్షల్లో తీసుకున్న వేతనాల గురించి, ప్రైవేటు ఏజెన్సీల దోపిడీ గురించి, ఆర్టీసీ వాహనాల అక్రమ వాడకం గురించి, హెల్త్ క్యాంపుల పేరుతో బ్రోకర్ల ద్వారా చేతులు మారిన కమీషన్ల గురించి సంస్థ ఎందుకు చెప్పడం లేదు?' అని మండిపడ్డారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం డిపోలకు డిపోలు ఎందుకు ఖాళీ చేయిస్తున్నారో చెప్పాలని కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది.

ఆర్టీసీ జేఏసీ లేవనెత్తిన ముఖ్య ప్రశ్నలు

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ ముందుకు సాగకపోడానికి కారణాలు ఏమిటో ఒక్క మాటైనా చెప్పారా? ఆ ప్రక్రియను అడ్డుకున్న వ్యక్తులు ఎవరో, ఎవరి వల్ల ఆ ప్రక్రియ జాప్యమవుతున్నదో ఎందుకు చెప్పడంలేదు?
- ప్రస్తుతం 40 వేల పైచిలుకు కార్మికులు పనిచేస్తున్న ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను గుర్తించకపోవడం కార్మిక చట్టాలకు విరుద్ధమని తెలియదా? ప్రభుత్వాలు అంగీకరించినా, హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా గుర్తింపు సంఘం ఎన్నికలను ఎందుకు నిర్వహించడం లేదు?
- ప్రతి షెడ్యూల్‌కు వందల కిలోమీటర్లు పెంచి 8 గంటల డ్యూటీలను 14-16 గంటలకు పొడిగించి కార్మికులను బానిసలకన్నా హీనంగా చూటడం లేదా? దానిపై యాజమాన్యం వివరణ ఏది?
- 'మహాలక్ష్మి' స్కీమ్‌లో జీరో టికెట్ల పేరిట ఎంతమంది ఉద్యోగాలు తీసేశారో మర్చిపోయారా? వారి గురించి ఎందుకు ప్రస్తావించలేదు?
- 2015 సంవత్సర వేతన సవరణ బకాయిలను 5 ఏండ్లకు వడ్డీతో కలిపి 2020 లోపల ఇవ్వాల్సి ఉన్నప్పటికీ 2024లో చెల్లించి 4 ఏండ్ల (2020-24) వడ్డీని ఎందుకు ఎగగొట్టారు?
- ప్రభుత్వ ఉద్యోగులకు 30% పీఆర్సీ ఇచ్చి హెచ్ఆర్ఏను 6% తగ్గించిన ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి 21% పీఆర్సీ ఇచ్చినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు కాకపోయినా వారితో సమానంగా 6% హెచ్ఆర్ఏ ఎందుకు తగ్గించింది?
- రిటైర్ అయినవాళ్లకు బాండ్ల పైసలు, 2017 వేతన సవరణకు 21% బకాయిలు ఇప్పటికీ ఎం దుకు ఇవ్వలేదు? 2017 నుంచి అమలు కావాల్సిన అలవెన్సుల ఊసు ఎందుకు ఎత్తడం లేదు?
- రిటైర్డ్ కార్మికులకు ఫైనల్ సెటిల్మెంట్ మొత్తాలు 2022 నుంచి ఎందుకు చెల్లించలేదు? ఆ డబ్బు ఇవ్వకపోతే వారు ఎలా బతకాలి?
- ఎస్‌బీటీ ఎస్ఆర్‌బీఎస్‌ను మూసివేసే ప్రతిపాదనను, కార్మికుల నిరసనతో ఉపసంహరించడం వాస్తవం కాదా?
- ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ భద్రత మార్గదర్శకాలు మనకంటే 50% వరకు మెరుగ్గా ఉన్నాయి.

ఢిల్లీకి సీఎస్

మొదటిపేజీ తరువాయి...

విచారణకు రానున్నది. దీంతో ఏం జరుగనున్నదో అని రాష్ట్ర ఉన్నతాధికారుల్లో ఉత్కంఠ నెలకొన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఈ కేసులో కీలమైన అధికారులైన అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, సలహాదారు శ్రీనివాస్‌రాజు, సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్‌రావు సహా పలువురు అధికారులు ఢిల్లీ వెళ్లారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్రానికి వచ్చిన కేంద్ర సాధికార కమిటీ కంచ గచ్చిబౌలి భూములను పరిశీలించింది. తమ పరిశీలనలో వెల్లడైన అంశాలను ఈనెల 14 వరకు సుప్రీంకోర్టుకు నివేదించనున్నట్టు సమాచారం. ఒకరిద్దరు ఉన్నతాధికారులపై కఠిన చర్యలకు కమిటీ సిఫారసు చేస్తుందనే సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టుకు ప్రభుత్వం సమర్పించాల్సిన అఫిడవిట్‌పై న్యాయ సలహాల కోసం వారు ఢిల్లీ వెళ్లినట్టు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో రహస్య సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. ఈ నెలోనే సీఎస్ శాంతికుమారి, పీసీసీఎఫ్ డోబ్రియాల్ పదవీ విరమణ పొందుతున్నారు. సాధారణంగా ఇలాంటి కేసులు విచారణ ముగిసేంత వరకు సంబంధిత అధికారులను బాధ్యతల నుంచి తప్పించవద్దని కూడా సుప్రీంకోర్టు ఆదేశించే అవకాశాలు ఉంటాయని న్యాయనిపుణులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా అడ్వకేట్స్ సలహా కోసమే ఉన్నతాధికారుల బృందం ఢిల్లీకి వెళ్లినట్టు తెలిసింది.

పాక్‌ను వీడిన 8.61 లక్షల మంది అఫ్గాన్ శరణార్థులు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని అఫ్గానిస్థాన్ శరణార్థులను స్వదేశానికి పంపించే కార్యక్రమంలో రెండో దశ ఈ నెల 1 నుంచి ప్రారంభమైంది. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ వెల్లడించిన సమాచారం ప్రకారం, 2023 సెప్టెంబరు 15 నుంచి 2025 ఏప్రిల్ 5 వరకు 8,61,763 మంది అఫ్గాన్ శరణార్థులు పాకిస్థాన్ నుంచి వెళ్లిపోయారు. దాదాపు 5 లక్షల మంది ఖైబర్ పఖ్తుంఖ్వాలోని రెండు మార్గాల గుండా వెళ్లిపోయారు.

ఇండియన్ స్క్రీన్ ఎరుగని కాప్ స్టోరీ?

ప్రభాస్‌తో సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' సినిమా మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందట. ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్‌పై ఈ తరహా కథ రాలేదని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 'కాప్ స్టోరీలు ఇప్పటి వరకూ ఇండియన్ స్క్రీన్‌పై కొన్ని వందలు వచ్చుంటాయి. కానీ.. ఈ తరహా కాప్‌ని మాత్రం ఇండియన్ ఆడియన్ కచ్చితంగా చూసుండడు. ఇది ఒక కథకునిగా చెబుతున్న మాట.' అని సందీప్‌రెడ్డి వంగా తెలిపారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనుల్ని శరవేగంగా పూర్తి చేస్తున్నారు సందీప్ రెడ్డి వంగా. ఓ వైపు ఇప్పటికే హర్షవర్ధన్ రామేశ్వర్‌తో మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా పూర్తి చేశారు. స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం నటీనటుల వేటలో ఉన్నారు సందీప్‌రెడి. ఇందులో కొరియన్, అమెరికన్ యాక్టర్స్ కూడా నటించనున్నట్టు తెలుస్తున్నది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారట. ఆయన పాత్ర నెట్స్ లెవల్లో ఉంటుందని సమాచారం. ఈ ఏడాది ద్వితీయార్ధంలో షూటింగ్ మొదలు కానుంది. టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

అఖండ అఘోరా ప్రచండ తాండవం

'అఖండ' ఇంటర్వెల్ సీక్వెన్స్ గుర్తొస్తేనే గూజ్‌బంప్స్ వచ్చేస్తాయి. ఆ స్థాయిలో తెరకెక్కించారు దర్శకుడు బోయపాటి శ్రీను. సినిమాలో అఘోరా పాత్ర ఎంటరయ్యేది కూడా ఆ సీన్లోనే. ఆ ఎపిసోడ్‌లో తమన్ ఇచ్చిన ఆర్.ఆర్ అద్భుతమైతే.. బాలకృష్ణ స్క్రీన్ ప్రెజన్స్ మహాద్భుతం. ప్రస్తుతం 'అఖండ' సీక్వెల్‌గా 'అఖండ - తాండవం' సినిమాను బోయపాటి తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఈ సీక్వెల్‌కి సంబంధించిన ఇంటర్వెల్ సీక్వెన్స్ కోసం ఓ భారీ సెట్‌ను మేకర్స్ సిద్ధం చేస్తున్నారు. ఈ సెట్‌లోనే రెండువారాల పాటు ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తారట. స్టంట్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్స్ నేతృత్వంలో ఈ ఫైట్ చిత్రీకరణ జరుగుతుందని తెలుస్తున్నది. తొలి పార్ట్ ఇంటర్వెల్ ఎపిసోడ్‌ని మించేలా ఈ ఎపిసోడ్ ఉంటుందని బోయపాటి టీమ్ చెబుతున్నది. సినిమా మొత్తానికీ ఈ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని వారు నమ్మకంగా చెబుతున్నారు. ప్రస్తుతం హిమాలయాల్లో బాలయ్య అఘోరా పాత్రపై కీలక సన్నివేశాలను తీస్తున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయ్యాక, ఇంటర్వెల్ ఎపిసోడ్ షూట్ మొదలవుతుందట. 14రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

చిత్రం

ఆ విషయంలో ఎన్టీఆర్‌కి రుణపడి ఉంటా

దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'వార్ 2'. హృతిక్‌రోషన్‌తో టాలీవుడ్ అగ్రహీరో ఎన్టీఆర్ చేతులు కలపడంతో సినిమాపై అంచనాలు అంబరాన్ని తాకాయి. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. కియారా అడ్వాణీ కథానాయిక. అగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. హిందీతోపాటు తెలుగు, తమిళ భాషల్లో కూడా సినిమాను విడుదల చేస్తారట. ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటిస్తున్నట్టు బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. గతంలో సల్మాన్, హృతిక్, షారుఖ్‌లు రా ఏజెంట్లుగా నటించి మెప్పించారు. వారి పాత్రలకు పూర్తి భిన్నంగా ఎన్టీఆర్ పాత్రను డిజైన్ చేశారట అయాన్ ముఖర్జీ. అంతేకాక హృతిక్‌తో ఢీ అంటే ఢీ అనేలా ఎన్టీఆర్ పాత్ర ఉంటుందట. హృతిక్, ఎన్టీఆర్‌లపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని తెలుస్తున్నది. ఈ పాటలో ఈ ఇద్దరు హీరోలతో పాటు 500మంది డాన్సర్లు కూడా పాల్గొన్నారట. ప్రీతమ్ స్వరపరిచిన ఈ పాటకు బాస్కో మార్టిస్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరించినట్టు సమాచారం. ప్రస్తుతం సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఇదిలావుంటే. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న హృతిక్ 'వార్ 2'తోపాటు ఎన్టీఆర్ గురించి కూడా ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ' 'వార్ 2' నా కెరీర్‌లోనే సులభంగా పూర్తయిన సినిమా. షూటింగ్‌ని పర్‌ఫెక్ట్‌గా ప్లాన్ చేసుకోవడం వల్లే ఇది సాధ్యమైంది. ఈ క్రెడిట్ అయాన్ ముఖర్జీదే. ఎన్టీఆర్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం. అతని ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నా. తనకెప్పుడూ రుణపడి ఉంటా. 'వార్'తో పోల్చుకుంటే 'వార్2' అన్ని విధాలా బావుంటుంది. ఈ సినిమాలో నటించినందుకు గర్వంగా ఉంది.' అంటూ చెప్పుకొచ్చారు హృతిక్ రోషన్.

అరడజను సినిమాలతో బిజీ బిజీ

80ల్లో చిరంజీవి, బాలకృష్ణ ఏడాదికి ఏడెనిమిది సినిమాలు చేసేవారు. ఇప్పుడైతే ఒక స్టార్ హీరో ఏడాదికి ఒక సినిమా విడుదల చేస్తే గొప్ప. అయితే.. తమిళ అగ్ర హీరో ధనుష్ మాత్రం 80ల నాటి హీరోల స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో అరడజను సినిమాలున్నాయి. ఈ ఏడాదిలోనే రెండు సినిమాలు విడుదల కానున్నాయి. వాటిలో ఒకటి టాలీవుడ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న 'కుబేర' కాగా, రెండోది ధనుష్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న 'ఇడ్లీ కడై'. రీసెంట్‌గా 'ఇష్క్ మైన్' అనే బాలీవుడ్ సినిమాకు కూడా ఓకే చెప్పారు ధనుష్. ఈ క్రమంలోనే శేఖర్ కమ్ముల చెప్పిన కథను ఓకే చేసి, వెంటనే ఆయన దర్శకత్వంలోనే మళ్లీ నటించేందుకు రెడీ అయిపోయారు. అలాగే.. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ హారర్ థ్రిల్లర్లో నటించనున్నారు. వీటితోపాటు ఇళయరాజా బయోపిక్ ఎలాగూ ఉంది. ఇండియాలో ఇంత బిజీగా ఉన్న స్టార్ హీరో బహుశా ఎవరూ లేరేమో.

పోలీసువారి హెచ్చరిక పాటల హంగామా

సన్నీ అఖిల్, రవికాలె, అజయ్‌ఘోష్, షాయాజీ షిండే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాజ్జీ దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లి జనార్ధన్ నిర్మాత. హైదరాబాద్‌లో ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. జయసుధ, ఆర్.నారాయణమూర్తి, తమ్మారెడ్డి భరద్వాజ్, తనికెళ్ల భరణి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. చక్కటి సామాజిక సందేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసి త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని దర్శకుడు బాబ్జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కమ్యూనిస్ట్ నాయకులు కూడా పాల్గొన్నారు. సుభలేఖ సుధాకర్, షాయాజీ షిండే, గిద్దేష్, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: కిషన్ సాగర్, కొండపల్లి నళినీ కాంత్, సంగీతం: గజ్వేల్ వేణు.

బేషరతుగా క్షమాపణ చెబుతున్నా..

తనకు తాను ప్రేమించుకోవడం.. ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత.. ప్రస్తుతం సమంత ప్రాధాన్యత వీటికే. నచ్చినట్టు బతుకుతున్నారు. నచ్చిన సినిమాలు చేస్తున్నారు. మహిళాసాధికారత, వ్యక్తిగత సంరక్షణ తదితర అంశాలపై ఇన్‌స్టా ద్వారా సందేశాలిస్తున్నారు. దాన్ని ఆమె బాధ్యతగా భావిస్తారు కూడా. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తనలో వచ్చిన మార్పును వివరించారు. 'నేను ఇండస్ట్ర